భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

● వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
● అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
● ప్రత్యేక పూజలు

పాత గుంటూరు: నగరంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మూడో రోజు అమ్మవారిని విశేషంగా ఆలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో విశేష సంఖ్యలో సువాసినీలు పాల్గొని సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ, ఉత్సవ కమిటీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

■ ఆర్.అగ్రహారంలో వేంచేసి ఉన్న కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు చండీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు టీఎల్వీ వీరాంజనేయులు, నేరెళ్ల వెంకట హరిప్రసాద్‌రావు పర్యవేక్షించారు.

■ సంపత్‌నగర్‌లోని శారదాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రేమ్ కుమార్ బృందం నిర్వహించిన కచేరీ భక్తులను ఆకట్టుకుంది. ఆలయాల వద్దకు భక్తులు పోటెత్తి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.


సంపత్‌నగర్ శారదా పరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న సువాసినిలు


ఆర్.అగ్రహారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు


లాలాపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఐశ్వర్య లక్ష్మీదేవి అలంకారం


సంపత్ నగర్ శారదా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వృషభ వాహన అలంకారం

క్లుప్తంగా

జిల్లా ఎస్పీకి సత్కారం



నగరంపాలెం: లాలాపేట పీఎస్ పరిధిలోని మంత్రిబజార్‌లో సోమవారం నాలుగేళ్ల పఠాన్ షాహిద్‌అలీఖాన్ కిడ్నాప్‌కు గురవ్వగా.. గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించిన విషయం విధితమే.. ఈ కేసులో సత్వరమే స్పందించిన జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నారీ సమాన్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలు షేక్ సలీమా, సభ్యురాలు ఫైరోజ్‌లు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, ఎస్బీ ఇన్‌చార్జి సీఐ బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడకుండా చర్యలు చేపట్టండి..

నగరంపాలెం: మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. పశ్చిమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. గుంటూరు నగరంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నూతన విధి విధానాలపై ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులతో ఎస్పీ మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలను కౌన్సెలింగ్‌కు వచ్చే తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తలెత్తే దుష్పరిణామాలను వారికి వివరించాలని చెప్పారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరీ

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం, 45వ వార్షికోత్సవం, వాగ్గేయకార మహోత్సవాలు ముగింపు సందర్భంగా పాలఘాట్ రాంప్రసాద్ బృందం చేసిన శాస్త్రీయ సంగీత కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీ త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రితో పాటు అనేక వాగ్గేయకార కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై ఎల్.రామకృష్ణన్, మృదంగంపై పి.ఫల్గుణ్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, సహ కార్యదర్శి కృష్ణ కిశోరులు ఘనంగా సత్కరించారు. వల్లూరి కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకై క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పర్యవేక్షణలో ఐటీఎం స్కిల్స్ అకాడమీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల్లో రాత, మౌఖిక పరీక్షల అనంతరం తొమ్మిది మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అభినందించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ



నెహ్రూనగర్: రెడ్డి జన సేవాసమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్‌లో మంగళవారం స్కాలర్‌షిప్పులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీసీ ఎక్స్‌పోర్ట్ జనరల్ మేనేజర్ వి.వెంకట్రామిరెడ్డి, మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ శీలం వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొని విద్యార్థులకు రూ. 7 లక్షల స్కాలర్‌షిప్పులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహాయం అందుకుని చదువులో రాణించాలన్నారు. చదువులేకపోతే భవిష్యత్తు లేదని పేర్కొన్నారు. నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలి సభ్యులు మోదుగుల పాపిరెడ్డి, చల్లా అంజిరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, కంది సంజీవరెడ్డి, వి.సాంబిరెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, భవనం వెంకటరెడ్డి, లేళ్ల పెదఅప్పిరెడ్డి, జంగా సీతారామ్‌ప్రసాద్, శ్యామల కోటిరెడ్డి, దుగ్గెంపూడి సాంబశివారెడ్డి, ఓరుగంటి నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు 80 ఏళ్ల వృద్ధురాలికి కోత కుట్టు లేకుండా అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. గుంటూరులోని కోబాల్ట్‌పేటకు చెందిన 80 ఏళ్ల హబీబున్నిసా ఈనెల 10న గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగానికి చికిత్స కోసం వచ్చింది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేసి చిన్నపేగులో పసరుతిత్తినాళం, ప్యాంక్రియాస్ నాళం కలిసేచోట చిన్న గడ్డ ఉన్నట్లు నిర్ధారించారు. ఈనెల 14న వృద్ధురాలికి ఎండోస్కోపిక్ ద్వారా కోత, కుట్లు లేకుండా తుది దశలో ఉన్న క్యాన్సర్ గడ్డను తీసి పెద్ద ఆపరేషన్‌తో పనిలేకుండా నివారించారు. ఆరోగ్యం కుదటపడడంతో 14న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఫాలోఅప్ చికిత్స కోసం మంగళవారం హబీబున్నిసా జీజీహెచ్‌కు రాగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులను అభినందించారు.


గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఈసీజీ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి ..

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గుండె జబ్బుల వైద్య విభాగానికి అనేక మంది పేద రోగులు వస్తున్నారని, ఈసీజీ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఈసీజీ విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసీజీ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని, రోగుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఉద్యోగులు పని తీరు మార్చుకోకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని ఉన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరుఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీకి చెందిన షేక్ లాహెరా సెల్‌ఫోన్‌కు ఇటీవల వాట్సాప్‌లో లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా అవతలవారు టాస్క్ ఇచ్చారు. రూ. వెయ్యి చెల్లించి టాస్క్ పూర్తి చేస్తే రూ.1400 చెల్లిస్తామని చెప్పారు. లాహెరా మొదట టాస్క్ పూర్తి చేయడంతో రూ. 1400 వచ్చాయి. అనంతరం రూ. 3వేలు చెల్లించాలని గ్రూపు నిర్వాహకులు చెప్పారు. లాహెరా రూ. 3వేలు చెల్లించి టాస్క్ పూర్తి చేసింది. అయితే టాస్క్ పూర్తి కాలేదని గ్రూపు నిర్వాహకులు మెసేజ్ ఇచ్చి మరికొంత చెల్లించాలంటూ పలుమార్లు కోరారు. లాహెరా మెసేజ్‌లో వచ్చిన ప్రకారం మొత్తం రూ.79వేలు చెల్లించింది. తనకు రావాల్సిన డబ్బులు నిర్వాహకులు ఇవ్వకపోడంతో తాను మోసపోయినట్లు గుర్తించి, బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లేస్‌మెంట్ బ్రోచర్లు ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పలు కళాశాలల ప్లేస్‌మెంట్ బ్రోచర్లను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల పూర్తి సమాచారంతో రూపొందించిన ప్లేస్‌మెంట్ బ్రోచర్లు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు సులభంగా లభించేందుకు దోహదం చేస్తాయన్నారు. యూనివర్సిటీ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, ఆర్కిటెక్చర్ కళాశాల, వ్యాయామ విద్య కళాశాలల బ్రోచర్లు ఆవిష్కరించడం జరిగిందన్నారు. కరోనా తర్వాత జరిగిన 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. రెక్టార్ ఆచార్య, ప్రిన్సిపాల్స్ పి.సిద్ధయ్య, ఆచార్య పి.జాన్సన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జీవీఎస్‌ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రొమ్ము సమస్యలపై ఉచిత కన్సల్టేషన్

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ రొమ్ము (బ్రెస్ట్) పునఃనిర్మాణ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని అక్టోబరు 18 నుంచి నవంబరు 17 వరకు నెలరోజులపాటు ఉచిత కన్సల్టేషన్ ఇస్తున్నట్లు అమేజ్ మెడ్‌స్పా కాస్మోటిక్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ సెంటర్ అధినేత, ప్రముఖ కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సుమితా శంకర్, డాక్టర్ నిశాంత్ సాధనాల చెప్పారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేట 10వలైనులోని ప్లాస్టిక్ సర్జరీ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెలరోజులపాటు ఉచితంగా కన్సల్టేషన్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి రాయితీతో రొమ్ము ఆపరేషన్లు చేస్తామన్నారు. రొమ్ము క్యాన్సర్ సోకిన వారికి రొమ్మును తిరిగి పునఃనిర్మాణం చేయవచ్చని, అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రొమ్ము పునఃనిర్మాణ శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తున్నామని, ఈసౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. రొమ్ము సమస్యలపై అవగాహన, ఉచిత కన్సల్టేషన్ కోసం 8885084495 నంబరులో సంప్రదించవచ్చు అన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సుమితా శంకర్, పక్కన డాక్టర్ నిశాంత్

పేకాట రాయుళ్లపై కేసు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంజీవయ్యనగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడిచేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 13,500లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష


శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న నూరిఫాతిమా


శిబిరాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ షేక్ సజిల

● వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా
● ఏడో డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం పరిశీలన

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఈమేరకు మంగళవారం ఏడో డివిజన్‌లోని లాల్‌జాన్‌బాషా హాలులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధితో అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌కుమార్, ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్, వైఎస్సార్ సీపీ నేతలు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా 12వ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దానిలో భాగంగా గత నాలుగు రోజులుగా డ్రెయినేజీ, కాలువల మరమ్మతులకు సంబంధించి పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. నూరిఫాతిమా మాట్లాడుతూ డివిజన్‌లో పలు సమస్యలు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో వాటిని పరిష్కరించేందుకు దృష్టి సారించామన్నారు. కార్పొరేటర్ రామనబోయిన అజయ్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి హన్ను పాల్గొన్నారు.

7వ డివిజన్‌లో..

పట్నంబజారు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల అన్నారు. మంగళవారం తూర్పు నియోజకవర్గంలో 7వ డివిజన్ పరిధిలో లాల్‌జాన్‌బాషా షాదీఖానాలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. ఈసందర్భంగా డెప్యూటీ మేయర్ సజిల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

15 రోజుల్లో లేఅవుట్‌లకు అనుమతి

నగర కమిషనర్ కీర్తి చేకూరి


నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా దరఖాస్తు చేసే లేఅవుట్‌లకు 15 రోజుల్లో అనుమతులు ఇస్తామని, అనధికార లే అవుట్స్ తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీలులేదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్స్‌కి 15 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అనధికార లే అవుట్స్‌ని రానున్న వారం రోజుల్లో తొలగించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. దరఖాస్తు చేసిన లే అవుట్ అనుమతుల్లో ఎటువంటి జాప్యం, లేదా సమస్యలు ఉన్నా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని, లేకుంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 లేదా, 9849908381 నంబర్‌కు వాట్సాప్ చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో పెండింగ్ ఉన్న సర్వే దరఖాస్తులను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటెమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు కోటయ్య, మహాపాత్రో, ఏసీపీలు అజయ్ కుమార్, టీపీఎస్‌లు, ఏఈ పాల్గొన్నారు.


పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

27న ఓటర్ల ముసాయిదా జాబితా

నెహ్రూనగర్: క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు చేసిన ఇంటింటి సర్వేలో సేకరించిన ఫారాలను ఏఈఆర్‌ఓలు ప్రత్యక్షంగా పరిశీలించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 27కి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల కానున్నదని, నగరంలోని రెండు నియోజక వర్గాల్లో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేలో వచ్చిన ఫారాలను ఏఈఆర్‌ఓలు నేరుగా పరిశీలించాలన్నారు. ఫారాల్లో తప్పనిసరిగా అర్జీదారు, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ అధికారి సంతకాలు, రిమార్క్స్ ఉండాలన్నారు. ఎన్నికల విధులు ఎంతో అప్రమత్తంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పెండింగ్ ఫారాలను ఈ నెల 27 తర్వాత ఆన్ లైన్ చేయాల్సి ఉంటుందని, అందుకు తగిన విధంగా సూపర్‌వైజరి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) సి.హెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆధునిక జీవనశైలితో లివర్‌కు ముప్పే



కాలేయం (లివర్) శరీరంలో అతి పెద్ద గ్రంథి. అది సక్రమంగా పనిచేయకపోతే అనేక రోగాలు మనల్ని చుట్టుముడతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు పలువురు లివర్ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మన దేశంలో అత్యధిక సంఖ్యలో వ్యాధి బారిన పడుతున్నారని కూడా హెచ్చరించింది. లివర్ వ్యాధుల్ని సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో క్యాన్సరుగా మారే అవకాశం ఉంది. దీని బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది అక్టోబర్‌ను అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

– గుంటూరు మెడికల్

● పెరుగుతున్న వ్యాధుల బాధితులు
● అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
● ఇది లివర్ క్యాన్సర్ అవగాహన నెల
● గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు

లివర్ బాధితులు ఇలా..

జిల్లాలో 15 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండగా, ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు లివర్ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో వారంలో మూడు రోజులు ఉండే ఓపీ వైద్య విభాగానికి ఒక్కో రోజు 20 మందికి పైగా లివర్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. జీజీహెచ్‌లో 2020లో 2,224 మంది, 2021లో 4,081 మంది, 2022లో 4,576 మంది, 2023 ఆగస్టు వరకు 2,780 మంది చికిత్స పొందారు. వీరిలో 20 శాతం మంది లివర్ సంబంధిత వ్యాధి బాధితులు ఉండటం గమనార్హం.

లివర్ చేసే పనులు

ఉదరంలో కుడి వైపున మధ్యలో కాలేయం ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయడం, జీర్ణక్రియకు దోహదపడే పైత్యరసాన్ని ఉత్పత్తి చేయడంతో పాటు శరీరంలో కొవ్వు, చక్కెర, ప్రొటీన్ శాతాన్ని నియంత్రిస్తుంది. శరీరం జబ్బు బారిన పడకుండా రక్షించడంతో పాటు రక్తశుద్ధి చేస్తుంది. శరీరంలోని విషాల్ని హరిస్తుంది. శరీరంలోకి ప్రవేశించే హానికర పదార్థాల్ని తొలగించి, ఆహారాన్ని శక్తి రూపంలోకి మారుస్తుంది. వివిధ హార్మోన్ల విడుదల్ని నియంత్రణలో పెడుతుంది. రక్తం గడ్డ కట్టడానికి, గాయాలు త్వరగా మానడానికి కావాల్సిన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేయడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది.

కాలేయ సమస్యలకు ముఖ్య కారణాలు

■ మత్తు పదార్థాలతో పాటు పొగ తాగడం, కొవ్వు పదార్థాల్ని అతిగా తీసుకోవడం, ఇన్‌ఫెక్షన్స్
■ విచ్చలవిడి లైంగిక సంబంధాలు, ఒకరికి వాడిన సూదిని మరొకరికి వాడటం వల్ల హెపటైటిస్ బీ, సీ వ్యాధుల ప్రమాదం
■ కలుషిత రక్తమార్పిడి, కలుషిత నీరు, ఆహారం వల్ల హెపటైటిస్ ఏ, ఈ వ్యాధులొస్తాయి
■ శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల స్థూలకాయంతో కొవ్వు పెరిగి కాలేయంపై పేరుకుపోతుంది
■ నూనె వస్తువులు ఎక్కువగా తినడం, పిజ్జాలు, బర్గర్స్‌లు, ఫాస్ట్‌ఫుడ్ వల్ల లివర్ వ్యాధులు వస్తాయి
■ శరీరానికి హానిచేసే మందులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా సమస్యలు తలెత్తుతాయి
■ మన రోగనిరోధకశక్తి మనవైపే ప్రతికూలంగా పని చేయడానికి అవకాశం ఉన్నప్పుడు, వంశపారంపర్యంగా కాలేయ వ్యాధులు వస్తాయి
■ తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కామెర్ల సమస్యలు ఉన్నట్లు భావించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

జీజీహెచ్‌లో లివర్ మార్పిడికి సన్నాహాలు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో లివర్ మార్పిడి ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు. ఆపరేషన్లు చేసేందుకు కావాల్సిన వైద్య పరికరాల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పెషాలిటీ వైద్య నిపుణులు సైతం లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలకు ఆసుపత్రిలో కావాల్సిన సౌకర్యాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. త్వరలోనే గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్లు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు.

మద్యం జోలికి వెళ్లవద్దు



ఆల్కాహాల్ వల్ల లివర్ దెబ్బతింటుంది కాబట్టి దాని జోలికి వెళ్లవద్దు. కొవ్వు పదార్థాలు, వేపుళ్లు అతిగా తినవద్దు. ఉప్పు, చక్కెర , రెడ్‌మీట్ ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. పచ్చని ఆకు కూరలు తినడం వల్ల లివర్ శుభ్రంగా ఉంటుంది. ఆలీవ్ ఆయిల్స్, వాల్‌నట్స్, గ్రీన్ టీ, ఆపిల్ పండ్లు, వెల్లుల్లి పాయలు, పసుపు లివర్‌కు మేలు చేస్తాయి. విటమిన్ సీ ఎక్కువగా తీసుకుంటే కాలేయం వద్ద పేరుకుపోయే కొవ్వును నియంత్రణ చేస్తుంది. రోజూ నీటిని ఎక్కువగా తాగడం వల్ల కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యసేవలు



ఆధునిక జీవనశైలి వల్ల నేడు లివర్ క్యాన్సర్లు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల్లో హెపటోబ్లాస్టోమా అనే లివర్ క్యాన్సర్లు వస్తున్నాయి. జన్యుపరమైన లోపాలతో వస్తున్న ఈ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్లకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్లు, వైద్యసేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, మెడికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

ఆటోడ్రైవర్‌పై దాడి

పట్నంబజారు: ఆటోడ్రైవర్‌పై దాడి ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసుల వివరాల ప్రకారం రాధాకృష్ణ థియేటర్ ఆటోస్టాండ్‌లో షేక్ బాషా అనే వ్యక్తిని మంగళవారం గుర్తుతెలియని మరో ఆటోడ్రైవర్ పూటుగా మద్యం సేవించి రాడ్‌తో దాడిచేశాడు. బాషాకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.